

రుణమాఫీ అయ్యిందా అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అడిగితే.. చేతులు పైకెత్తి కాలేదని నినదిస్తున్న రైతులు

# నమ్మించి మోసం జేసిండ్రు

## ధోకా చేసిన కాంగ్రెస్ సర్కారుపై రైతు కన్నెర్ర

- రైతును కష్టపెట్టినోడు బాగుపడడు
- రుణమాఫీ జేస్తామంటే నమ్మినం
- 15 వేలు ఇస్తమంటే నమ్మి తప్పుజేసినం
- ఏదీ చెయ్యలే.. కేసీఆర్ ఇచ్చినట్లన్న ఇయ్యట్లే
- ముఖాముఖిలో గోడు వెల్లబోసుకున్న రైతాంగం

**రెండు లక్షల రుణమాఫీ** ఇస్తామంటే నమ్మినం. 15 వేలు రైతుబంధు ఇస్తామంటే నమ్మినం. వాళ్ల మాట ఇని ఓట్లేస్తే మమ్మల్ని గిట్ల మోసం జేసిండ్రని రైతులు కాంగ్రెస్ సర్కారుపై నిప్పులు చెరిగారు. మెండోరా మండలం బుస్సాపూర్‌లో శనివారం పర్యటించిన బీఆర్‌ఎస్ రైతు అధ్యయన కమిటీ ఎదుట తమ గోడు వెల్లబోసుకున్నారు. కేసీఆర్ పాలనల మంచిగుండే. ఇప్పుడు మా బతుకుల ఆగమైనయని వాపోయారు. కేసీఆర్ సార్ ఉన్నప్పుడు నాట్లు ఏయక మునేపే రైతుబంధు పైసలు అచ్చేటియి. ఆ పైసల్తోనే ఇత్తనాలు, మందులు కొంటుంటిమి. ఏ బాధ ఉండకపోయేది. కాంగ్రెసోళ్లు అచ్చినంక రైతుబంధు ఇయ్యకుండా ఎగ్గొట్టిండ్రు. విత్తనాలు ఏసేతందుకు పైసలు కావాల కదా. మళ్లీ అప్పు జేయాల్సి వచ్చిందని వరించారు. రైతుల గోడు వారి మాటల్లోనే..

–మోర్తాడ్, మార్చి 25

### కరంటు సరిగ్గ ఉంటలేదు



పదేండ్లు కరంటు సరిగ్గ ఉండే. ఏడాది నుంచి సక్కగ ఉంట లేదు. ఎప్పుడు పోతదో తెలని పరిస్థితి. కేసీఆర్ ప్రభుత్వం కంటే ముందు ఇంట్ల ఇన్వర్టర్ పెట్టించుకుందామనుకన్న. కని కేసీఆర్ అచ్చినంక 24 గంటల కరంటు ఇచ్చుట్ల అవ సరం పడలే. ఇప్పుడైతే కరంటు ఎప్పుడు పోతుందో తెలు స్తలేదు. అడిగితే మీదికెళ్లి పోయందంటుండ్రు. రానురాను ఇంకెట్లుంటదో కరంటు పరిస్థితి.

**- జగత్‌రెడ్డి, రైతు, దూద్‌గాం**

### కేసీఆర్ కన్నతండ్రి లెక్క



కేసీఆర్ అంటే రైతులకు ఒక కన్న తండ్రి లెక్క. చెప్పనివి కూడా మస్తు జేసిండు. ప్రేమతోని చూసుకుండు కేసీఆర్. మాయమాటలు చెప్పి సీటుమీదికి వచ్చిండు రేవంత్‌రెడ్డి. వాళ్ల మాటలు నమ్మినందుకు ఇప్పుడు గోసపడుడు అయితుంది.

**- మిట్టపల్లి గంగయ్య, మెండోరా**

### మాఫీ అయిందాకా బాకీ కట్ట అని జెప్పిన



నాకు బ్యాంకుల రెండున్నర లక్షల రుణం ఉంది. బ్యాంకోళ్లు బాకీ కట్టుమంటున్నరు. నేను కట్టా అని కరాఖండిగా జెప్పేసిన. కేసీఆర్‌ను వద్దనుకుని కాంగ్రెస్‌కు ఓటేసినమా. ఇప్పుడల్ల అందరు కేసీఆర్‌ను కావాలనుకుంటుండ్రు. రైతుభరోసా ఇస్తమని రైతులను మోసం చేసిండ్రు కదా. ఇప్పుడు సర్పంచ్ ఎలక్షన్లల్ల రేవంత్‌రెడ్డికి బుద్ధి జెప్తం. కేసీఆర్ చెట్టు పెట్టి నీడనిచ్చేటోడు. అటువంటి కేసీఆర్‌ను వద్దనుకున్నందుకు బాధ వడుతున్నం.

**- రాకేశ్, రైతు, బాబాపూర్**

### కాల్వలకు నీళ్లొస్తలేవు..



ఫారెన్‌లో హోటల్ మెనేజ్‌మెంట్ చేసిన. వ్యవసాయం బాగుంటుందని తిరిగి వచ్చిన. వస్తే ఏం లాభమున్నది. వచ్చినంక రైతుబంధు లేదు. రుణమాఫీ లేదు. రైతుబంధు రాక పం టకు సరిపడా ఎరువులు కొనే ధైర్యం వస్తలే. రైతుబంధు ఇస్తమంటుండ్రు కాని ఇస్త లేరు. కరంటు కూడ సరిగా అస్తలేదు. అడిగితే బ్రేక్‌డౌన్ అవుతుందంటుండ్రు. ఇంతకు ముందు ఎందుకు బ్రేక్‌డౌన్లు కాలే. ఇంతకు ముందు కాల్వల నీళ్లు వస్తుండే. ఇప్పుడు వస్తలే.

**- ఎర్రం సాగర్, రైతు, బాల్కొండ**

### రైతుకే వడ్డీ ఎక్కువ



రైతుకు ఇచ్చే రుణం రేట్ ఆఫ్ ఇంట్రెస్ట్ ఎక్కువ ఉంటది. అదే కార్లకు, బంగ్లాకు ఇచ్చే రుణం రేట్ ఆఫ్ ఇంట్రెస్ తక్కువ ఉంటది. మరి రైతులకు ఇచ్చే రుణానికి వడ్డీ ఎక్కువ ఎందుకు ఉంటది. రైతులకు ఇచ్చే రుణాలకు వడ్డీ తక్కువ ఉండేటట్లు చూడాల.

**- జైడి సాయన్న, రైతు, బుస్సాపూర్**

### మనం నమ్మి తప్పుజేసినం



రుణమాఫీ రెండులక్షలు ఇస్తమంటే, రైతుబంధు 15 వేలు ఇస్తమంటే నమ్మి తప్పుజేసినం. ఇప్పుడు రుణమాఫీ సగం మందికి కాలే, రైతుబంధు రాలే. నమ్మి కాంగ్రెస్‌కు ఓట్లేసి మోసపోయినం. పడిత్ ఉన్న భూములకు రైతుబంధు ఇయ్యమంటున్నరు. పైసలు లేక భూములను డెవలప్ చేసుకోలే. రైతుబంధు ఇవ్వకుంటే ఎట్ల? డెవలప్ చేసుకుంటున్న భూములకు కూడా రైతబంధు ఇయ్యాలే. నాలుగైదు ఎకరాలు ఉండి డెవలప్ చేసుకునేటోళ్లకు రైతుబంధు ఇచ్చేలా మాకోసం మీరు కొట్లాడుండ్రి.

**- అశోక్, రైతు, దూదిగాం**

### రైతుబంధు ఇచ్చే వరకు కొట్లాడాలే..



రైతుబంధు ఇస్తమని చెప్పి ఇస్తలేరు. రైతులంతా ఏకమై కొట్లాడాలే. అప్పుడే పది వేలంటరు. అప్పుడే పన్నెండు వేలంటరు. 15 వేలు ఇస్తమని ఇస్తలేరు. ఇప్పటికైనా రైతులంతా ఏకం గావాలే. రైతుబంధు వచ్చే వరకు కొట్లాడాలే. రుణమాఫీ కూడా బ్యాంకుల ఎంత లోన్ ఉన్నా సంబంధం లేకుండా రెండు లక్షల రుణమాఫీ జెయ్యాలే.

**- నోముల రవీందర్, రైతు**

## ప్రభుత్వ ప్రతీకార చర్యలతోనే ఆత్మహత్యలు

- ఆదిలాబాద్ జిల్లాలో మరో రైతు ఆత్మహత్య బాధాకరం: మాజీ మంత్రి వేముల
- ఆత్మహత్యలు చేసుకున్న రైతులకు సభావేదికగా సంతాపం



ఆదిలాబాద్ జిల్లాలో రైతు ఆత్మహత్య చేసుకున్న ఫొటోను ఫోన్‌లో చూపిస్తున్న వేముల

మోర్తాడ్, జనవరి 25: బుస్సాపూర్‌లో రైతు ముఖాముఖి కార్యక్రమం జరుగుతున్న సమయంలోనే ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలంలో రైతు మామిళ్ల నర్సయ్య ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఇప్పుడే తెలిసిందని ఫోన్‌లో వచ్చిన మెస్సేజ్‌ను మాజీ మంత్రి వేముల చూపించారు. అధ్యయన కమిటీ రైతుల బాధలు తెలుసుకుని వారిలో ధైర్యాన్ని నింపేందుకు తిరుగుతున్న ఈ సమయంలోనే మరో రైతు నేలవాలిండని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుర్మార్గమైన ప్రభుత్వం చేతకానితనం వల్ల, కక్షపూరిత వైఖరి వల్ల కేసీఆర్ ఏం చేస్తే అది తీసేయ్యాలనే పిచ్చి ప్రతీకార చర్యల వల్ల రైతులకు ఈ దుస్థితి ఏర్పడుతున్నదన్నారు. కేసీఆర్ రైతుబంధు ఇస్తే దాన్ని ఆపేయాలా? కేసీఆర్ పంటలు కొంటే మనం కొన్ని రోజులు లేట్ చేయాలా? అన్న ప్రభుత్వ ఆలోచనలతోనే రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ఆత్మహత్యలు చేసుకున్న రైతుల ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించాలని కోరడంతో కార్యక్రమానికి హాజరైన రైతులు, అధ్యయన కమిటీ సభ్యులు లేచి మౌనం పాటించారు.

## కాంగ్రెస్ సర్కారుపై 'గుస్సా'పూర్

- బీఆర్‌ఎస్ అధ్యయన కమిటీకి 82 వినతులు
- రైతుభరోసా, రుణమాఫీ, కరెంట్ కోతలపై మొర
- బాల్కొండ నియోజకవర్గ వ్యాప్తంగా రైతుల సమర్పణ
- బుస్సాపూర్ రైతుల ముఖాముఖిపై సంబురపడ్డ ముఖ్య నేతలు
- నివేదికలో పొందుపరుస్తామని చెప్పిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



తమ సమస్యలపై అధ్యయన కమిటీ చైర్మన్ నిరంజన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

నిజామాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రోజుకొకరు చొప్పున రాష్ట్రంలో ఆత్మహత్య చేసుకుంటున్న రైతుల దీనావస్థపై అధ్యయనం చేసేందుకు జిల్లాకు వచ్చిన బీఆర్‌ఎస్ రైతు ఆత్మహత్యల అధ్యయన కమిటీకి భారీగా వినతులు వెల్లువెత్తాయి. బాల్కొండ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న రైతులు బుస్సాపూర్‌లోని ముఖాముఖి కార్యక్రమానికి హాజరైన అధ్యయన కమిటీ చైర్మన్ నిరంజన్‌రెడ్డితో తమ గోడు వెల్లబోసుకున్నారు. తమ బాధలను, అవస్థలను, సలహాలు, సూచనలు, కాంగ్రెస్ పార్టీ తీరుతో ఎదుర్కొంటున్న ఇక్కట్లను అక్షర రూపంలో సమర్పించారు. బాల్కొండలోని అన్ని మండలాల నుంచి రైతులు వినతులను రాసుకొచ్చి అధ్యయన కమిటీకి స్థానిక ఎమ్మెల్యే వేముల ఆధ్వర్యంలో సమర్పించారు. ఇందులో అనేక మంది రుణమాఫీ, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కరెంట్ కోతలు, సాగునీటి సౌకర్యాలు, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల అమలులో వైఫల్యం, ఎస్సారెస్పీ నిర్వహణలో లోపాలు, పంటలకు గిట్టుబాటు, రూ.500 బోనస్ వర్తింపు, పంటల కొనుగోళ్లు వంటి సమస్యలపై మొర పెట్టుకున్నారు. గతంలో కేసీఆర్ పాలనలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు. అలాంటిది ఇప్పుడు కాంగ్రెస్ హయాంలో ఏడాది కాలంగా కనీవినీ ఎరుగని రీతిలో ఇక్కట్లు దాపురించాయి. ఊహించని విధంగా ఎదురవుతున్న ఈ సమస్యలను రైతులంతా కలిసి బీఆర్‌ఎస్ రైతు ఆత్మహత్యల అధ్యయన కమిటీ చైర్మన్‌కు సమర్పించారు. నెల రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా పర్యటనలు చేయనున్న వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి నేతృత్వంలోని 9 మందితో కూడిన బృందం తన నివేదికలో ఈ అంశాలను పొందుపర్చనుంది. పూర్తి స్థాయి నివేదికను రైతు కమిషన్‌కు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, బీఆర్‌ఎస్ అధినేతకు సమర్పించనున్నారు. కాంగ్రెస్ నిర్లక్ష్యపూరిత వైఖరిని ఎండగట్టడంతో పాటు రైతుల సమస్యలను తీర్చేందుకు ఈ ప్రయత్నానికి బీఆర్‌ఎస్ ఈ దిశగా చర్యలు చేపట్టింది. రైతులకు కొండంత అండగా నిలవడంతో పాటు ఆత్మహత్యల నివారణకు బీఆర్‌ఎస్ అధ్యయన కమిటీ కృషి చేస్తున్నది. జిల్లా పర్యటనల్లో భాగంగా రైతుల్లో మనోధైర్యాన్ని నింపుతున్నది. ఆత్మహత్యలు వద్దు. అండగా మేమున్నామంటూ భరోసానిస్తున్నది.

## 'ఓటర్స్ డే'

**ఎల్లారెడ్డి పట్టణంలో** శనివారం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా వివిధ కళాశాలల, పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, వివిధ శాఖల అధికారులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీచౌక్ వద్ద మానవహారంగా ఏర్పడి సామూహిక ఓటరు ప్రతిజ్ఞ చేశారు.



# నేడే ఆఖరు..

- ముగియనున్న మున్సిపల్ పాలకవర్గ పదవీకాలం
- ఎన్నికలు నిర్వహించేవరకు ప్రత్యేకాధికారుల పాలన!
- ఎల్లారెడ్డి మున్సిపల్‌లో ఐదేండ్లలో రెండు పార్టీలకు అధికారం




ఎల్లారెడ్డి రూరల్, జనవరి 25: మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం నేటితో ముగియనున్నది. మళ్లీ ఎన్నికలు నిర్వహించేవరకు ప్రత్యేకాధిరుల పాలన కొనసాగే అవకాశమున్నది. స్వరాష్ట్రం సిద్ధించాక అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ రాష్ట్రంలో నూతన మున్సిపాలిటీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఎల్లారెడ్డి, బాన్సువాడ, భీమ్‌గల్ మున్సిపాలిటీలుగా అవతరించాయి. ఎల్లారెడ్డి, పోసానిపల్లి, గండిమాసానిపేట్, లింగారెడ్డిపేట్, దేవునిపల్లి, బాలాజీ నగర్‌తండా, లింగారెడ్డిపేట్ తండా, మరో రెండు తండాలను కలిపి ఎల్లారెడ్డి మున్సిపాలిటీగా ఏర్పాటుచేశారు. మున్సిపాలిటీలకు కేంద్రప్రభుత్వం సైతం నేరుగా నిధులు ఇచ్చే అవకాశం ఉండడంతో పట్టణీకరణ తొందరగా అవుతుందని కేసీఆర్ భావించి మున్సిపాలిటీల సంఖ్యను గణనీయంగా పెంచారు.

### ఎల్లారెడ్డి మున్సిపాలిటీగా మారడం రెండోసారి.

నిజాం కాలంలో ఎల్లారెడ్డి అన్నిరంగాల్లో అభివృద్ధి చెంది కామారెడ్డి, బాన్సువాడ తదితర పట్టణాల కన్నా ముందుండేది. ఎల్లారెడ్డి ప్రాంతంలో చక్కెర కర్మాగారాలు, రైస్,ఆయిల్ మిల్లులు, గంజ్ తదితర వాటితో వ్యాపార కేంద్రంగా విరాజిల్లింది. పాత నిజామాబాద్ జిల్లాలోనే ఎల్లారెడ్డికి ప్రత్యేక స్థానం ఉండేది. ఎల్లారెడ్డి పట్టణంలో ప్రస్తుతం ఉన్న కోర్టు పరిధి అప్పట్లోనే ప్రస్తుత మహారాష్ట్ర ప్రాంతంలోని దెగ్లూర్, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ తదితర నియోజకవర్గాలకు కలిపి ఉండేది. ఎల్లారెడ్డి మొదటి మున్సిపల్ చైర్మన్‌గా ఆడ్వకేట్ మైసన్ ఎంపికయ్యారు. ఎల్లారెడ్డిలో అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం మేజర్ గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా అప్పటి ప్రభుత్వం మార్చింది. దాదాపు పదేండ్లకు పైగా మున్సిపాలిటీగా ఉన్న ఎల్లారెడ్డి అనుకున్న స్థాయిలో అభివృద్ధి చెందకపోవడంతో తిరిగి మేజర్ గ్రామపంచాయతీగా మార్చారు. దాదాపు నాలుగు దశాబ్దాల అనంతరం 2018 ఆగస్ట్ 2న పలు గ్రామాలు, తండాలను కలిపి మున్సిపాలిటీగా మార్చారు. అప్పటి నుంచి 2020 జనవరి వరకు ప్రత్యేకాధికారి పాలనలో కొనసాగింది.

### ఎల్లారెడ్డి మున్సిపాలిటీపై గులాబీ జెండా

2020 జనవరిలో జరిగిన ఎన్నికల్లో ఎల్లారెడ్డిలో గులాబీ జెండా ఎగిరింది. 12 స్థానాలకు తొమ్మిది కైవసం చేసుకొని ఘన విజయం సాధించింది. జాజాల సురేందర్ ప్రధాన అనుచరుడిగా గుర్తింపు పొందిన కుడుముల సత్యనారాయణ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అయితే, లోక్‌సభ ఎన్నికల ముందర ఆయన బీఆర్‌ఎస్‌ను వీడి కాంగెస్‌లో చేరారు. దీంతో ఆగ్రహించిన జాజాల తన దైన శైలిలో చక్రం తిప్పారు. బీఆర్‌ఎస్ కౌన్సిలర్లతో పాటు కాంగ్రెస్ కౌన్సిలర్లు సైతం కలిసికట్టుగా కుడుములపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి పదవీచ్యుతుడిని చేశారు. చివరకు మెజారిటీ కౌన్సిలర్లు పద్మ శ్రీకాంత్‌కు మద్దతు ప్రకటించడంతో ఆయన చైర్మన్‌గా అయ్యారు.

**ఇక అధికారుల పాలన!**

ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పాలకవర్గ పదవీకాలం నేటితో ముగిసిపోనున్నది. చైర్మన్ స్థానంలో స్థానిక ఆర్డీవోకు ప్రత్యేకాధికారి బాధ్యతలు అప్పగించే అవకాశం ఉన్నది. గతంలో సైతం పాలకవర్గం లేని సమయంలో స్థానిక ఆర్డీవోకు చైర్మన్‌గా బాధ్యతలను అప్పగిస్తూ ప్రత్యేకాధికారిగా ఉన్నతాధికారులు నియమించారు. పెండింగ్ పనులు, సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణం ప్రత్యేకాధికారుల పాలనలో కొనసాగుతాయా లేదా అనే విషయంపై చర్చ జరుగుతున్నది.

## ఒకరోజు ముందే ఎగిరిన మువ్వన్నెల జెండా

- గుర్తుతెలియని వ్యక్తి నిర్వాకం.. సోషల్ మీడియాలో వైరల్
- ఎల్లారెడ్డి పట్టణంలో ఘటన



గాంధీచౌక్‌లో ఎగురుతున్న జెండా, జెండా ఎగురవేస్తున్న వ్యక్తి (ఇన్‌సెట్‌లో)

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 25: ఎల్లారెడ్డి పట్టణంలోని గాంధీచౌక్‌లో మువ్వన్నెల జెండా ఒకరోజు ముందుగానే రెపరెపలాడింది. గుర్తుతెలియని వ్యక్తి నిర్వాకంతో ఈ ఘటన చోటుచేసుకున్నది. గాంధీచౌక్‌లో దశాబ్దాల కాలంగా స్థానిక వర్తక సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలను పురస్కరించుకొని జాతీయ జెండాను ఆవిష్కరిస్తూ వస్తున్నారు. ఇందులోభాగంగా ఆదివారం నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవం కోసం శనివారం రాత్రి కిరాణా వర్తక సంఘం ప్రతినిధులు గాంధీ చౌక్ ప్రాంతాన్ని శుభ్రం చేయడంతోపాటు స్తంభానికి జాతీయ జెండాను కట్టిఉంచారు. శనివారం రాత్రి 10 గంటల సమయంలో అటుగా వెళ్తున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి స్తంభానికి కట్టి ఉంచిన జాతీయ జెండాను ఆవిష్కరించి వెళ్లిపోయాడు. దీనిని గమనించిన స్థానికులు ఎల్లారెడ్డిలో ఒకరోజు ముందే జాతీయ జెండా ఎగరడంపై ఫొటోలు తీసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు. సమాచారం తెలుసుకున్న సంఘం ప్రతినిధులు గాంధీచౌక్ చేరుకొని జాతీయ జెండాను కిందికి దింపి, పోలీసులకు ఫిర్యాదుచేశారు.


గణతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు



ప్రభాకర్ చారి
ఎంపిడిఓ, నాగిరెడ్డిపేట్

విద్యార్థిని విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అధికారులకు, అనధికారులకు, గణతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు...

D.మల్లిఖార్జున్ జలాల్‌పూర్ | కిష్టయ్య అక్కంపల్లి | N.కార్తీక్ నాగిరెడ్డిపేట్

S.సంతోష్‌కుమార్ గోలీలింగాల్ | పంతుల తిరుపతి పోచారం | B.అనిత బొజుగంచెరువుతాండ | G.సంతోష్‌కుమార్ బొల్లారం

B.సురేందర్ చీనూర్ | G.రమేశ్ ధర్మారెడ్డి | N.కార్తీక్ I/c గోపాల్‌పేట్ | M.రవీంధర్ I/c ఆత్మకూర్

M.వెంకటరాములు అచ్చాయిపల్లి | G.వనజ లింగంపల్లి (కలాన్) | P.అశోక్ మల్తుమ్మెద | M.సుభాష్‌రెడ్డి మసాన్‌పల్లి

M.రవీంధర్ మతూర్ | N.ప్రవీత మల్లెకుంట తాండ | G.సంతోష్‌కుమార్ I/c పల్లెబోగుడతాండ | మమత బంజారతాండ

జానకి రాఘవపల్లి | కిష్టయ్య I/c తాండూర్ | MD.అజిముద్దీన్ వదల్‌పర్తి | D.రజిత వెంకంపల్లి

N.నరేశ్ కుమార్ వాడి | P.శంకర్ జప్తి జన్మంపల్లి | G.రమేశ్ కన్నారెడ్డి | M.రవీంధర్ I/c చిన్నా ఆత్మకూర్

గ్రామ పంచాయతీ కార్యదర్శులు & సిబ్బంది- మం॥ నాగిరెడ్డిపేట్